క్లుప్తంగా

ఖరీఫ్‌కు సన్నద్ధం



రేగిడిలో నారుమడులకు దుక్కిచేస్తున్న రైతు

రేగిడి: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమౌతున్నారు. అన్ని ప్రాంతాల్లో మెరకదుక్కులు చేపడుతున్నారు. పంటపొలాలు సారవంతంగా మార్చి, కలుపుమొక్కలు తొలగించి, పెంటగత్తం వంటివి పొలాల్లో వేస్తున్నారు. పలుచోట్ల నవధాన్యాలను పొలాల్లో చల్లి ప్రకృతి వ్యవసాయానికి అనుకూలంగా మార్చుతున్నారు. వాతావరణం చల్లబడుతుండడంతో వరి విత్తనాలు చల్లేందుకు ఆకుమడులను కూడా సిద్ధం చేసుకుంటున్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



మురుగుకాలువల నిర్మాణం

రాజాం: పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ఐటీ వరకు రూ.20 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నాడు రోడ్డుకు ఇరువైపులా అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. మూడు అడుగుల వెడల్పుతో డ్రైనేజీని నిర్మిస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు, మున్సిపల్ కార్యాలయం పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సీహెచ్.ప్రసాద్‌లు తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి..



చెరువులో ఆక్రమణలు చూపిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర రావు

బొబ్బిలి: పట్టణంలోని కోటగిరిబందలో చోటుచేసుకున్న ఆక్రమణలను తొలగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకర రావు డిమాండ్ చేశారు. చెరువులోని ఆక్రమణలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, చెరువులను కాపాడాలని కోరారు.

వాహన రాకపోకలు బంద్



వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వంగర: కిమ్మి–రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై వాహన రాకపోకలు నిలిపివేశారు. వంతెన నిర్మాణ పనులు పూర్తయిన తరువాత గత నెలరోజులుగా వంతెనపై వాహన రాకపోకలు సాగాయి. అయితే పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు వంతెన మీదుగా రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించే వారంతా పనులు పూర్తయ్యే వరకు నాగావళిలో పడవ ప్రయాణం చేయాల్సిందే.

బొబ్బిలిలో అవగాహన ర్యాలీ



పట్టణంలో సాగుతున్న అవగాహన ర్యాలీ

బొబ్బిలి: మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని పలు రహదారుల్లో ప్రపంచ రుతుస్రావ అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్‌వీ మురళీ కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కిశోర బాలికలు, మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీహెచ్‌సీ డాక్టర్ స్వాతి, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ తూముల బంగారు రాణి, మెప్మా సీఎంఎం జి. రాము, సీఓ రామలక్ష్మి, డీఈఓ భాను, ఏఎన్ఎంలు, ఆర్‌పీలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు తిమ్మయ్యపేటలో 'గడప గడపకు..'

రాజాం: పట్టణంలోని తిమ్మయ్యపేట, గాయత్రీ కాలనీల్లో సోమవారం ఉదయం 7 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొనే ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని సూచించారు.

ఎంపీడీఓ బదిలీ

రేగిడి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.కాశీవిశ్వనాథరావుకు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయింది. ఆయన ఇప్పటివరకు రేగిడి ఎఫ్ఏసీ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. సూపరింటెండెంట్ హోదాలో ఉన్న ఆయనకు ఎంపీడీఓగా పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు బదిలీ అయినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఉపాధి నిధులతో కాలువల అభివృద్ధి



అంతకాపల్లి వద్ద నీటిపారుదలకు అనుకూలంగా తోటపల్లి పిల్లకాలువ



మారెడుబాక వద్ద పిచ్చిమొక్కలు తొలగించిన అనంతరం తోటపల్లి కాలువ



సోపేరు వద్ద ఇలా..



పాగిరి సమీపంలో తోటపల్లి కాలువలో పనులు చేపడుతున్న వేతనదారులు

రాజాం సిటీ: తోటపల్లి కాలువల ద్వారా వచ్చే ఖరీఫ్‌లో ఆయకట్టు శివారు భూములకు నీరందేలా అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని పాగిరి, అంతకాపల్లి, సోపేరు, బొద్దాం, మారెడుబాక, గోపాలపురం, ఎంజేవలస, గడిముడిదాం తదితర గ్రామాల్లోని సాగునీటి కాలువలను ఉపాధిహామీ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. గత ఏడాది ఎదురైన అవరోధాలను అధిగమించి తోటపల్లి కాలువ ద్వారా మూడు పంటలకు నీరందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది రైతులు నీటికోసం ఇబ్బందులు పడాల్సిన అవసరంలేదన్నారు.

కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మల్లికార్జున కాలనీవాసులు

రాజాం: పట్టణంలోని సంతమార్కెట్‌ను ఆనుకుని ఉన్న మల్లికార్జునకాలనీలో డ్రైనేజీలు నిర్మించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే కంబాల జోగులును కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన్ను కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగుకాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోందని, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మురుగునీరు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును పిలిచి కాలువల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, చల్లా జయరాం, పిచ్చుక శ్రీనివాసరావు, బొమ్మన మున్నా, కుప్పిలి గణపతి, జినగం ఈశ్వరరావు, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు



ఉణుకూరులో తాగునీటి కుళాయిలు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

రేగిడి: మండలంలో పలు గ్రామాల్లో రక్షిత పథకాల ద్వారా పంపిణీ చేస్తున్న తాగునీటిని ప్రజలు వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ కోరారు. మండలంలోని ఉణుకూరు, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించి తాగునీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటి పైపులైన్లను పరిశీలించి, పాడైన వాటికి మరమ్మతులు చేయించారు.

చలివేంద్రం ఏర్పాటు



రాజాం: మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి భక్తులు

రాజాం: పట్టణంలోని అప్సర థియేటర్ సమీపంలో ఆదివారం బాబానగర్ శివం సత్యసాయి మందిరం సభ్యులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఆరు వారాలుగా ప్రతీ ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సత్యసాయి భక్తులు తెలిపారు. మిగిలిన రోజుల్లో చల్లటి మంచినీటిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రేగిడి: వన్నలి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన సత్యసాయి భజన మండలి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాటసారులు చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచరాం గ్రామానికి చెందిన పాండ్రంకి రాము, యజ్జిపురపు రాములు ద్విచక్రవాహనంపై రాజాం నుంచి స్వగ్రామం వెళుతున్నారు. గ్రామ సమీపంలోని మెయిన్ రోడ్డుపై బోర్‌వెల్ లారీని వెనుక నుంచి ఢీకొనడంతో గాయాల పాలయ్యారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ వెంకటరమణ, పైలెట్ శంకరరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇరువురు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

అవగాహన ర్యాలీ



రాజాం: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



తెర్లాం: కిశోర బాలికలకు నెలసరి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి

రాజాం: పట్టణంలో ప్రధాన రహదారిపై పలువార్డు సచివాలయాలకు చెందిన ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ రుతుస్రావ అవగాహన దినోత్సవం సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ రోస్నారాలు తెలిపారు. కౌమారదశలో శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రత్నం, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా ఆర్‌పీలు, సీఓలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

తెర్లాం: కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి దీక్షితారాణి, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. తెర్లాంలో ప్రపంప మహిళా నెలసరి పరిశుభ్రత అవగాహన దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ తులసి, తెర్లాం విలేజ్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఏఎన్ఎం ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం



గురుకులంలో ప్రత్యేకతరగతులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

బాడంగి: వచ్చే నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.రామదాసు చెప్పారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి తప్పిపోయిన విద్యార్థులకు జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో తప్పిపోయిన విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని తమ పాఠశాలతో పాటు సాలూరు, కొప్పెర్ల, ఎస్సీ వసతిగృహాలకు చెందిన విద్యార్థులంతా ఇక్కడే చదువుతున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు 31వ తేదీతో ప్రత్యేక తరగతులు ముగుస్తాయన్నారు. వీరికి జూన్ 2వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు.

చిరు వ్యాపారులకు సూరీడు దెబ్బ



రామభద్రపురం: అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్లో ఎండలో కష్టమర్ల కోసం ఎదురు చూస్తున్న చిరు వ్యాపారులు



నిర్మానుష్యంగా మారిన బాడంగి మెయిన్‌రోడ్డు



రేగిడి: నిర్మానుష్యంగా ఉన్న ఉంగరాడమెట్ట రోడ్డు

రామభద్రపురం: కొద్ది రోజులుగా ఎండలు తారెత్తిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జనం దాదాపు ఇళ్లకే పరిమితం కావడంతో వ్యాపారులు జరగడం లేదు. ప్రస్తుతం 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ప్రజలెవ్వరూ రోడ్డెక్కడం లేదు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ కూడా కొనుగోలుదారులు లేక వెలవెలబోతోంది.

మండుతున్న ఎండలు

బాడంగి: మండలంలో ఎండలు మండిపోతుండడంతో ప్రజలు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయంటే ఎండలు ఎంతలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వడగాడ్పులు వీయడంతో ప్రజలందరూ ఇళ్లకే పరిమితమయ్యారు.

రేగిడి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండలకు భయపడి ప్రజలు రోడ్లపైకి రాని పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ఉంగరాడ మెట్టతో పాటు పలు ప్రధాన రహదారులు ఆదివారం నిర్మానుష్యంగా కనిపించాయి.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



నూతనంగా నిర్మించిన రామ మందిరం

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలను సోమవారం నుంచి బుధవారం వరకు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వేదపండితులు పులఖండం శ్రీనివాసరావు శర్మ, అంపోలు రుద్రకోటేశ్వరరావు శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటిరోజు గ్రామ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, జలాధివాసం, రెండోరోజు జలోత్తరణ, క్షీరాధివాసం, ప్రాతఃకాలార్చన, సూర్య ఆరాధన, సర్వదేవతా మంత్రహోమాలు, మూడోరోజు ప్రాణ ప్రతిష్ఠ, మంగళహారతులు అనంతరం సాయంత్రం 4గంటలకు శ్రీనివాసానంద సరస్వతి సారథ్యంలో ఉత్సవమూర్తుల తిరువీధి ఉంటాయన్నారు. బుధవారం మధ్యాహ్నం ఏనుగుతల జగన్మోహనరావు దంపతులు, వల్లూరు మురళి దంపతుల సహాయ సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ మరణానికి కారకుడు చంద్రబాబే..



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

● ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీఆర్ మరణానికి కారకుడైన చంద్రబాబుకు ఆయన శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనే అర్హత లేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అప్పట్లో ఎన్టీఆర్‌ను పదవీవిచ్యుతుడిని చేయడానికి చంద్రబాబు కుయుక్తులు పన్నారన్నారు. ఆ సమయంలో ప్రజలు తిరగబడటంతో రామోజీరావు, చంద్రబాబు కాస్త వెనక్కి తగ్గినా.. తర్వాత ఆయన మరణానికి కారణమయ్యారన్నారు.

పేదలకు న్యూట్రిషన్ బాటిల్స్, తువ్వాళ్ల పంపిణీ..

పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం వద్ద మదర్ థెరీసా ట్రస్ట్ సీఈఓ క్లెయిఫై కూపర్ రిక్షా కార్మికులు, పేదలకు న్యూట్రిషన్ బాటిళ్లు, తువ్వాళ్లను పంపిణీ చేశారు. కనక మహేష్ పట్నాయక్, పీసీసీ సభ్యుడు ముప్పల శ్రీనివాసరావు, జి. పోలీసు, శ్రీనివాస్, పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాల కంబాల ఉత్సవం



ఉయ్యాల కంబాల ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

రాజాం సిటీ: పెనుబాక గ్రామంలో అసిరితల్లి పండగ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించారు. గత వారం రోజులుగా చేపడుతున్న గ్రామదేవత పండగ ఆఖరు దశకు చేరుకోవడంతో గ్రామమంతా కోలాహలంగా మారింది. మహిళల కోలాటాల నడుమ గ్రామస్తులంతా ముగ్రాటలతో ఊరేగింపు చేపట్టారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అంతా ఈ ఉత్సవంలో పాల్గొని సందడి చేశారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



తెర్లాం: గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



పిల్లలకు బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ జి. తిరుపతిరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు సత్యవాణి



బాడంగి: విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం రవిబాబు

రామభద్రపురం: గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా పిల్లల కోసం విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు ఆయా నిర్వాహకులు చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి సత్యవాణి చిన్నారులకు తెలుగు పద్యాలు, చందమామ కథలు, శతక పద్యాలు నేర్పించడంతో పాటు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్ట్ టీచర్లను రప్పించి గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్ తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ బొమ్మల తయారీపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలి..

తెర్లాం: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తక పఠనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చి వాటిని చదివించారు.

సత్ఫలితాలు వస్తున్నాయి...

బాడంగి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులతో సత్ఫలితాలు వస్తున్నాయని స్థానిక గ్రంథాలయాధికారి ఆర్. దుర్గాప్రసాద్ తెలిపారు. పింద్రంగివలస పాఠశాల హెచ్‌ఎం వై.రవిబాబు నీతివంతమైన జీవితం ఎలా గడపాలో వివరించారు. అలాగే గ్రంథాలయాధికారి కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహన కల్పించారు.

నేడు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

రాజాం: పట్టణంలో సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆదివారం స్థానిక మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల పట్టాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ ర్యాలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజాం జీఎంఆర్ఐటీ గేటు నుంచి కంచరాం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.